ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No: APTEL/2023/87888
గురువారం
27 నవంబర్ 2025

వెంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు భూమిపూజ చేసిన సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): దేవతల రాజధాని ఎలా ఉంటుందో.. అదే నమూనాతో ఏపీ రాజధాని అమరావతి ఉంటుందని సీఎం చంద్రబాబు అన్నారు. రాజధాని కోసం రైతులు 33వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారని, పవిత్ర కార్యక్రమానికి రైతులు సహకరించారని అభినందించారు. అమరావతిలోని వెంకటపాలెంలో వెంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు సీఎం చంద్రబాబు గురువారం భూమిపూజ చేశారు. రూ.260 కోట్లతో రెండు దశల్లో పనులు చేపట్టనున్నారు. ఆలయ ప్రాకారం, మహారాజగోపురం, ఆంజనేయస్వామి ఆలయాలు నిర్మించనున్నారు. మాడవీధులు, అన్నదాన కాంప్లెక్స్ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు.

మొదటి దశలో రూ.140 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందులో రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారాన్ని నిర్మిస్తారు. రూ.48 కోట్లతో ఏడంతస్తుల మహా రాజగోపురం, అర్జిత సేవా మండపం, వాహన మండపం, రథ మండపం, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ నిర్మిస్తారు. రెండో దశలో శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్‌రోడ్డు, అన్నదానం కాంప్లెక్స్, యాత్రికులకు విశ్రాంతి భవనం, అర్చకులు, సిబ్బంది క్వార్టర్స్, రెస్ట్ హౌస్, పరిపాలన భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ వంటి పనుల్ని చేపడతారు. వీటికి రూ.120 కోట్ల వ్యయం కానుంది. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం శ్రీవారి ఆలయాన్ని రూ.185 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయగా 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా.. దానిని రూ.36 కోట్లకు కుదించింది. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి.. ఆలయాన్ని 2014-19 నాటి ప్రణాళికను మించి సకల హంగులతో అభివృద్ధి చేసేందుకు అడుగు ముందుకేసింది.

భారత యువశక్తి నైపుణ్యానికి స్కైరూట్ గొప్ప ప్రతీక:ప్రధాని మోదీ

హైదరాబాద్, నవంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): శంషాబాద్‌లో స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ప్రారంభించారు. తొలి ప్రైవేటు కమర్షియల్ రాకెట్ విక్రమ్-1ను ఆవిష్కరించారు. స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ దేశంలోనే అతి పెద్ద ప్రైవేటు రాకెట్ ఫ్యాక్టరీ కావడం విశేషం.

ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. స్కైరూట్ బృందానికి అభినందనలు తెలిపారు. అంతరిక్షంలో ఇది ఒక గొప్ప మైలురాయి అని పేర్కొన్నారు. భారత యువశక్తి నైపుణ్యానికి స్కైరూట్ గొప్ప ప్రతీక అని పేర్కొన్నారు. భారత అంతరిక్ష రంగం భవిష్యత్తులో మరిన్ని ఘనతలు సాధిస్తుందని తెలిపారు. "ఈ విజయం భారత యువశక్తికి స్ఫూర్తినిస్తుంది. సైకిల్ పై రాకెట్ మోసుకెళ్లే స్థితి నుంచి మన ప్రస్థానం ప్రారంభమైంది. వ్యవసాయం, వాతావరణ అంచనాల్లో మరింత విజ్ఞానం సాధించాలి. స్పేస్ సెక్టార్లో కో ఆపరేటివ్, ఎకో సిస్టమ్ను తీసుకువచ్చాం. జనీ అనుకున్నది సాధించేలా ప్రభుత్వం సహకరిస్తుంది. అంతరిక్ష రంగంలో కేంద్రం ఇస్తున్న మద్దతు వల్లే స్టార్టప్లు వస్తున్నాయి. ప్రైవేటు రంగంలోనూ అంతరిక్ష సంస్థలు పుట్టుకొస్తున్నాయి. జనీ ఇంజినీర్లు, డిజైనర్లు, కోడర్స్, సైంటిస్టులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి" అని మోదీ తెలిపారు.

రాజధాని రైతుల సమస్యలపై త్రిసభ్య కమిటీ సమావేశం

అమరావతి, నవంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ గురువారం మరోసారి సమావేశమైంది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణకుమార్‌లతో కూడిన కమిటీ.. వివిధ అంశాలపై చర్చించనుంది.

జరీబు-మెట్ట భూములు, గ్రామ కంఠాలు, అసైన్డ్, లంక భూముల రైతుల సమస్యల పరిష్కారంపై నేతలు చర్చించనున్నారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని కమిటీ కసరత్తు చేస్తోంది. రైతుల ప్లాట్లకు హద్దు రాళ్లు వేసి.. వెంటనే అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే నిర్ణయించింది. గుంటూరు, మంగళగిరి నుంచి అమరావతికి వచ్చే రోడ్ల అభివృద్ధిపైనా కమిటీలో చర్చించనున్నారు. శనివారం ఉదయం మరోసారి సమావేశం కావాలని కమిటీ నిర్ణయించింది. మరోవైపు ఇవాళ సాయంత్రం 4 గంటలకు రాజధాని రైతులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. రైతులకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించనున్నారు.

అంతర్జాతీయ డిజిటల్ అరెస్టు ముఠా గుట్టు రట్టు.. 13 మంది అరెస్టు

భీమవరం, నవంబర్ 27, (రిపబ్లిక్ న్యూస్): అంతర్జాతీయ డిజిటల్ అరెస్టు ముఠా గుట్టును భీమవరం పోలీసులు రట్టు చేశారు. ఇటీవల విశ్రాంత ప్రొఫెసర్ శర్మ నుంచి సైబర్ నేరగాళ్లు రూ.78 లక్షలు దోచుకున్నారు. సిమ్ కార్డు వచ్చిందని, సీబీఐ అధికారులమంటూ ఆయనకు ఫోన్ చేశారు. సిమ్ కార్డులో తేడా ఉందని తాము సరిచేస్తామని పేర్కొన్నారు. అనంతరం డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు బెదిరించారు. ఈక్రమంలో శర్మ ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలను ముఠాకు తెలిపారు. 13 రోజుల వ్యవధిలో ఆయన ఖాతాలో ఉన్న రూ.78 లక్షలను నేరగాళ్లు కాజేశారు. దీంతో బాధితుడు క్రైమ్ బ్రాంచ్ పోలీసులను ఆశ్రయించాడు. భీమవరం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 7 బృందాలుగా వేట మొదలుపెట్టారు. మొత్తం 14 మందిని నిందితులుగా గుర్తించి 13 మందిని అరెస్టు చేశారు. ముంబయికి చెందిన ప్రధాన సూత్రధారి రహతే జె నయన్ పరారీలో ఉన్నాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి వెల్లడించారు. ఇలాంటి కేసుల్లో బాధితులు ఎక్కువగా విశ్రాంత ఉద్యోగులు, ఒంటరి వాళ్లే 66 ఉంటున్నారని చెప్పారు. బాధితుడికి బెంగుళూరు నుంచి సిమ్ కార్డు పేరుతో ఫోన్ వచ్చిందని చెప్పారు. " 14 మంది నిందితుల్లో ఏడుగురు గతంలో కంబోడియా దేశంలో పనిచేశారు. రూ.78 లక్షల్లో రూ.42 లక్షలు రికవరీ చేశాం. వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.19 లక్షలు ఫ్రీజ్ చేశాం. ఇలాంటి కేసుల్లో ఇంత మొత్తంలో నగదు రికవరీ చేయడం ఇదే మొదటిసారి. నిందితులు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలో ఉన్నారు. వీరిలో కొంతమంది టెకీలు సైతం ఉన్నారు. ఒకరు ప్రముఖ సంస్థలో సాఫ్ట్వేర్ ఇంజినీర్ గా పనిచేశారు. డిజిటల్ అరెస్టు అంటూ ఏదీ ఉండదు. డిజిటల్ అరెస్టు పేరుతో ఫోన్లు వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలి" అని ఎస్పీ తెలిపారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

నాకున్న ఏకైక కోరిక ఇదే.. కుటుంబ వివాదంపై మంచు లక్ష్మీ

తన కుటుంబంలో వివాదాలు వస్తాయని ఎప్పుడూ అనుకోలేదని మంచు లక్ష్మి అన్నారు. సినిమా ప్రచారాల్లో కాకుండా విడిగా తనకు ఇంటర్వ్యూలు ఇవ్వడంపై ఆసక్తి ఉండదన్నారు. తాజాగా ఒక పాడ్కాస్ట్లో పాల్గొన్న ఆమె పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఒక తల్లిగా, సోదరిగా, కుమార్తెగా ఉన్నా, అన్ని బాధ్యతల్లోకెల్లా తల్లిగా తనకు 10కి 10 మార్కులు వేసుకుంటానన్నారు. ఇక మంచు కుటుంబంలో జరిగిన వివాదాల గురించి మంచు లక్ష్మి మాట్లాడారు. "దేవుడు నాకు కనిపించి ఒక వరం కోరుకోమంటే. నా కుటుంబమంతా మళ్లీ కలిసిపోవాలని కోరుకుంటాను. గతంలో ఉన్నట్లు అందరూ కలిసిఉండాలని అడుగుతాను. అన్ని కుటుంబాల్లో గొడవలు ఉంటాయి. కానీ, ఎన్ని వివాదాలు వచ్చినా చివరకు అందరూ ఒక్కటవ్వాలి. భారతీయ కుటుంబాల్లో కొన్నిసార్లు గొడవలైతే.. జీవితాంతం కలవకూడదు అనుకుంటారు. కానీ, మనకు చివరకు మిగిలేది రక్తసంబంధీకులు మాత్రమే అని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలి. ఫ్యామిలీతో కలిసి ఉండటానికి ఎన్ని పోరాటాలైనా చేయాలి. అంతేకానీ, దూరాన్ని పెంచకూడదు"."నేను ముంబయిలో ఉంటాను. ఇక్కడి విషయాల గురించి తెలిసినా బాధ పడలేదని కొంతమంది వార్తలు రాశారు. నేనెంత బాధను అనుభవించానో నాకు మాత్రమే తెలుసు. ఆ వివాదం గురించి ఏం మాట్లాడలేదు కాబట్టి.. వారికి నచ్చినట్లు ఊహాగానాలు సృష్టించారు. నేను వాటి గురించి స్పందించాలని అనుకోలేదు. ఇది నా వ్యక్తిగత విషయం. ఇలాంటి వివాదాలు వస్తాయని ఎప్పుడూ అనుకోలేదు. అవన్నీ చూశాక షాక్ అయ్యాను. నా కుటుంబం గురించి నేను ఏమనుకుంటున్నానో ఆ వివాదాల వల్ల ఎంత బాధ పడ్డానో బయటవాళ్లకు చెప్పాల్సిన అవసరం లేదని అనుకున్నాను" అని మంచు లక్ష్మి తెలిపారు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

అప్పటి వరకు గౌతమ్ గంభీరే కోచ్ :బీసీసీఐ వర్గాలు

టీం ఇండియా ఇంతకుముందు న్యూజిలాండ్ చేతుల్లో స్వదేశంలో వైట్వాష్కు గురైంది. ఆ చేదు జ్ఞాపకాలు ఇంకా పూర్తిగా చెరిగిపోకముందే.. తాజాగా దక్షిణాఫ్రికా చేతిలోనూ సొంతగడ్డపై 0-2 తేడాతో సిరీస్ కోల్పోయింది. గంభీర్ కోచ్ గా వచ్చిన 16 నెలల కాలంలో టీమ్ ఇండియా మూడు టెస్ట్ సిరీస్ లు ఓడిపోయింది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాపై ఓటమి పాలైంది. ఇప్పటివరకు భారత జట్టు 19 టెస్ట్ మ్యాచ్లు ఆడితే కేవలం 7 మ్యాచుల్లోనే విజయం సాధించింది. ఏకంగా 10 టెస్టుల్లో పరాజయం పాలైంది. 2 మ్యాచ్లు డ్రాగా ముగిశాయి. గెలుపు శాతం కేవలం 36.82గా ఉంది. ఈ నేపథ్యంలో టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ను ఆ పదవి నుంచి తప్పించాలని డిమాండ్లు ఊపందుకుంటున్నాయి. గువాహటి టెస్ట్ మ్యాచ్ అనంతరం మైదానంలోని పలువురు అభిమానులు సైతం గంభీర్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. కానీ బీసీసీఐ మాత్రం కోచ్ గౌతమ్ గంభీర్ కు మద్దతుగా నిలుస్తోంది! 'బీసీసీఐ తొందరపాటుగా ఏ నిర్ణయాలూ తీసుకోదు. ప్రస్తుతం టీమ్ ఇండియా మార్పు దశలో ఉంది. వరల్డ్ కప్ సమీపిస్తున్న నేపథ్యంలో కోచ్ గౌతమ్ గంభీర్ విషయంలో ఇప్పటికిప్పుడు ఏ నిర్ణయమూ తీసుకోం. అతడి కాంట్రాక్ట్ 2027 వరల్డ్ కప్ వరకు ఉంది. బీసీసీఐ.. సెలక్టర్లు, టీమ్ మేనేజ్మెంట్తో మాట్లాడి ముందుకుసాగుతుంది. కానీ కోచ్ విషయంలో సంచలన నిర్ణయాలూ ఏమీ ఉండవు' అని బీసీసీఐకి చెందిన ఓ అధికారి తెలిపారు. నిన్న (బుధవారం) గువాహటి టెస్టో ఓటమి అనంతరం విలేకరుల సమావేశంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మాట్లాడాడు. కోచ్గా తన భవిష్యత్తు విషయంలో విలేకరుల నుంచి ఎదురైన ప్రశ్నకు సమాధానం ఇచ్చాడు. 'ఆ విషయాన్ని బీసీసీఐ నిర్ణయిస్తుంది. ఇండియన్ క్రికెట్ ముఖ్యం. నేను కాదు. ఈ విషయాన్ని నేను టీమ్ ఇండియా హెడ్ కోచ్గా నియమితమైన తర్వాత నిర్వహించిన మొదటి ప్రెస్మీట్లోనే చెప్పాను. ఇప్పుడు కూడా అదే చెబుతున్నాను. యువ జట్టుతో ఇంగ్లాండ్ లో సాధించిన ఫలితాలను మర్చిపోయిన జనం.. న్యూజిలాండ్ చేతిలో ఓటమి గురించే మాట్లాడతారు. నేను ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ లోనూ జట్టును గెలిపించాను' అని గౌతమ్ గంభీర్ అన్నాడు.

గోధుమ పిండి ఇంట్లోకి ఎలుకలు రాకుండా

ఆపుతుంది, అయితే వాడే విధానం ఏంటో తెలుసా?

ఇంటి చిట్కాలు

చాలా మంది ఎలుకల మందుతో వాటిని తరిమికొట్టడానికి ప్రయత్నిస్తారు. ఎలుకల మందుతో పాటు వివిధ రసాయనాలతో వాటి బెడద వదిలించుకోవాలనుకుంటారు. అయితే.. ఇంట్లో చిన్న పిల్లలు ఉంటే ఈ రసాయనాలు చాలా ప్రమాదం. పిల్లలకు తెలియకుండా రసాయనాల్ని ఎలుకల మందును నోట్లో పెట్టుకునే అవకాశం ఉంది.

ఎలుకల భయం అనేది ప్రతి ఇళ్లల్లో ఉంటుంది. ఎక్కడో మూలల్లో నక్కి ఇంటి మొత్తాన్ని నాశనం చేస్తుంటాయి ఎలుకలు. ఇక, వాటి మల వ్యర్థాల నుంచి వచ్చే వాసన చాలా భయంకరంగా ఉంటుంది. ఇక కర్మ కాలి.. ఎలుక చచ్చిపోతే.. ఆ వాసనను తట్టుకోవడం ఎవ్వరీ వల్ల కాదు. ఆ వాసనకు వాంతులు వస్తాయి. అంతేకాదు ఎలుకలు చేసే పనుల వల్ల తలనొప్పి వస్తుంది. ఒక్కోసారి అల్మారాలో ఉంచిన కొత్త బట్టల్ని పాడు చేస్తాయి. మనం తినే తిండిని కూడా వదలవు. ఒక్కోసారి డబ్బుల్ని కూడా నాశనం చేస్తాయి. అంతే కాదు ప్లేగు వంటి ప్రమాదకరమైన వ్యాధులు ఎలుకల వల్ల వస్తాయి. అందుకే వీటిని ఇంటి నుంచి తరిమికొట్టాలి.చాలా మంది ఎలుకల మందుతో వాటిని తరిమికొట్టడానికి ప్రయత్నిస్తారు. ఎలుకల మందుతో పాటు వివిధ రసాయనాలతో వాటి బెడద వదిలించుకోవాలనుకుంటారు. అయితే.. ఇంట్లో చిన్న పిల్లలు ఉంటే ఈ రసాయనాలు చాలా ప్రమాదం. పిల్లలకు తెలియకుండా రసాయనాల్ని ఎలుకల మందును నోట్లో పెట్టుకునే అవకాశం ఉంది. అందుకే ఎలాంటి టెన్షన్ లేకుండా.. ఎలుకల్ని తరిమికొట్టేందుకు కొన్ని ఇంటి చిట్కాలు బాగా పనిచేస్తాయి. అందులో గోధుమ పిండి ఒకటి. గోధుమ పిండి ఉపయోగించి ఎలుకల్ని ఇంటి నుంచి తరిమికొట్టవచ్చు. ఎలానో ఇక్కడ తెలుసుకోండి.

మొదటి చిట్కా కోసం కావాల్సిన పదార్థాలు

పిసికిన పిండి
బిర్యానీ ఆకులు
టీ ఆకులు
వంట సోడా
డిటర్జెంట్ పౌడర్

పిండిని ఎలా తయారు చేయాలి

ఇంటి నుంచి ఎలుకలను తరిమికొట్టడానికి, ముందుగా గోధుమ పిండిని సాధారణ పద్ధతిలో పిసికి కలుపుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నెలో బిర్యానీ ఆకులు, టీ ఆకులు, బేకింగ్ సోడా, డిటర్జెంట్ పౌడర్ వేసి కలపాలి. మీరు ఈ మిశ్రమాన్ని స్ప్రేయింగ్గా ఉపయోగించాలి. పిండిని సన్నని ఉండలుగా చేసి, ఆ మిశ్రమాన్ని మధ్యలో ఉంచి బంతుల్లా చుట్టుకోవాలి. ఇలా పిండితో చిన్న చిన్న ఉండలను తయారు చేసి ఇంటి మూలల్లో ఉంచండి. లేదా ఎలుకలు ఎక్కువగా కనిపించే ప్రాంతాల్లో ఉంచండి. ఈ ఘాటైన వాసనలు కలిగిన వస్తువులు ఎలుకలను ఇంటి నుంచి దూరంగా ఉంచుతాయి. అంతేకాకుండా వీటిని తిన్న తర్వాత వాటి ఘాటుకు తట్టుకోలేక ఇంటి నుంచి పారిపోతాయి.

రెండో చిట్కా కోసం కావాల్సిన పదార్థాలు

గోధుమ పిండి బంతి
పొగాకు
ఎండు మిర్చి
దేశీ నెయ్యి

దీన్ని ఎలా వాడాలి

మొదటి చిట్కాని ఫాలో అయినట్టే రెండో ట్రిక్ కూడా ఉపయోగించాలి. అయితే, ఇక్కడ పిండి మధ్యలో పెట్టే స్ప్రేయింగ్ మాత్రమే మారుతుంది. పొగాకు, ఎండు మిర్చి పొడి, దేశీ నెయ్యిని బాగా కలపాలి. ఇప్పుడు పిండి మధ్యలో ఈ మిశ్రమాన్ని పెట్టి బంతుల్లా చుట్టుకోవాలి. మీరు ఈ బంతులను వేర్వేరు మూలల్లో ఉంచవచ్చు. నిజానికి, దేశీ నెయ్యి వాసన కారణంగా ఎలుకలు పిండి ముద్దల వైపు ఆకర్షణకు గురవుతాయి. ఇక, పొగాకు ఒక మత్తు పదార్థం. ఎండు మిర్చి ఘాటుగా ఉంటుంది. దీనిని తిన్న తర్వాత అవి ఇంటి నుండి వెళ్లిపోతాయి.

వీటిని కూడా వాడుకోవచ్చు

పిండిలో ఘాటైన వాసనలు ఉన్న పదార్థాలు వాడటం మంచి ఆప్షన్. ఎలుకలను తరిమికొట్టడానికి ఎర్ర మిరపకాయ, పొగాకు, బే ఆకులతో పాటు, వెల్లుల్లి, పుదీనా లేదా యూకలిప్టస్ నూనెను కూడా ఉపయోగించవచ్చు . అన్ని వస్తువులను పిండి ముద్దలో ఉంచాలి. ఆ పిండి ముద్దల్ని ఇంటి మూలాల్లో లేదా ఎలుకలు ఎక్కువ ఉండే ప్రాంతాల్లో ఉంచాలి. వీటి దెబ్బకి ఎలుకలు ఇంటి నుంచి పారిపోతాయి.

గమనిక

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. ఇవి పాటించాలని సమయం తెలుగు చెప్పడం లేదు. ఈ విషయాల్ని ధృవీకరిచడం లేదు.